క్లుప్తంగా

నేడు సుల్తానాబాద్‌లో సురక్ష వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం సుల్తానాబాద్‌లోని ఆర్‌సీఎం స్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 34వ సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

పెదకాకాని: బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని గ్రామ సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడులో గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో గ్రామ బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాల్లోపు మగ పిల్లలకు వివాహాలు చేయడం నేరమని చెప్పారు. గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా చూడవలసి బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు రామారావు, క్రాఫ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



నగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. స్థానిక ఎస్వీ ఆర్‌ఎం కళాశాలలో గురువారం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పోటీల్లో కళాశాల కబడ్డీ జట్టు తృతీయ స్థానం సాధించిందని ఆయన తెలిపారు. క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.వెంకటనారాయణ, పీఈడీ సాంబమూర్తి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

మంగళగిరి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ మల్లిఖార్జునరావు హెచ్చరించారు. గురువారం రాత్రి పట్టణంలోని పలు చోట్ల మద్యం సేవించే వారితో పాటు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 10 మందికి జరిమానా విధించడం జరిగిందన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్,సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడపడం నిషేధమని ప్రతిరోజూ నగరంలోని కూడళ్లలో తనిఖీలు నిర్వహించి తొలిసారి జరిమానా విధించడం జరుగుతుందని అనంతరం కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఎస్‌ఐ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామశివారులోని సాయినాథ ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి మహాహారతి, కాగడ హారతి, అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: నవంబర్ 15వ తేదీన విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. గురువారం దుగ్గిరాలలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ హైలెవల్ చానల్ పూర్తి చేయకపోవడం కారణంగా వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని, బకింగ్‌హామ్ కెనాల్ పక్కన ఉన్న వరిపంట పొలాలు ఎండిపోతున్నాయని, ఆయిల్ ఇంజిన్ ద్వారా ఎకరానికి రూ.10వేలు అదనంగా పెట్టుబడి పెట్టి వరిపొలాలకు నీరు పెడుతున్నారని అన్నారు. దుగ్గిరాల జగనన్న కాలనీ పక్కన కరెంటు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జె.బాలరాజు, ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, జి.యోహాను, కె.కోటయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక పింఛన్ల పంపిణీ



కిడ్నీ పేషంట్‌కి పింఛన్ అందజేస్తున వలంటీర్



డానియేల్‌కు పింఛన్ నగదు అందస్తున్న వలంటీర్ విజయదుర్గ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం గురువారం కొనసాగింది. వార్డు వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు పంపిణీ చేశారు. లబ్ధిదారులు కొందరు వివిధ హాస్పటల్స్‌లో ఉండటంతో అక్కడికి వెళ్లి మరీ నగదు అందజేశారు. పినపాడు-1 సచివాలయ పరిధిలోని కొసూరి కృష్ణ ఆనారోగ్యంతో బాధపడుతూ తెనాలిలోని జేకే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ జి.శ్రావణి అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందించారు. అలాగే సుల్తానాబాద్ సచివాలయ పరిధిలోని వేగుంట శ్రీనివాసరావు ఆనారోగ్యంతో తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ బి.శ్రీలేఖ అక్కడికి వెళ్లి వికలాంగ పింఛను నగదు అందించారు. లక్ష్మీనగర్ సచివాలయ పరిధిలోని కె.కృష్ణ మోహన్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ విజయవాడలోని విజయ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ జి.సీతారామ్ అక్కడికి వెళ్లి పింఛన్ రూ.10వేలు అందజేశారు. అలాగే 25వ వారుడ సచివాలయ పరిధిలోని మానసిక దివ్యాంగుడు మేక డానియేల్‌కు వలంటీర్ జి.విజయదుర్గ వికలాంగ పింఛన్‌ను పంపిణీ చేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య

తెనాలిఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో జరగనున్న భారీ భహిరంగ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని డాల్ మిల్ వర్కర్స్ యూనియన్ తెనాలి ప్రధాన కార్యదర్శి జి.వెంకట సుబ్బయ్య కోరారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం డాల్ మిల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో ఆర్థిక అసమానతలు తొలగిపోవాలంటే సీపీఎం ప్రకటించిన ప్రజా ప్రణాళిక అమలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు కె.బాబుప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, పాదిలి రంగయ్య, సీహెచ్ స్టాలిన్ బాబు, కె.శ్రీనివాసరావు, విజయశంకర్, డి.రమణారెడ్డి, ఏడుకొండలు, కె.వాసురెడ్డి, జె.వెంకట సాయి, కె.నరసింహారావు, జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- లారీలో చుండూరు నుంచి కాకినాడకు తరలింపు?
- పట్టుకున్న విజిలెన్స్ అధికారులు
- నలుగురిపై కేసు నమోదు



లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, జిల్లా సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు

చేబ్రోలు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చుండూరు మండలం నుంచి చేబ్రోలు మీదుగా కాకినాడకు లారీలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో నిఘా వేశారు. చేబ్రోలులోని విఘ్నేశ్వర సినిమా హాలు వద్ద లారీని నిలుపదల చేసి తనిఖీలు నిర్వహించారు. తెల్ల ప్లాస్టిక్ గోతాలలో ఉన్న 700 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీ డ్రైవర్ ధీరజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. చుండూరులోని పద్మశ్రీ రైస్ మిల్లు నుంచి 700 బస్తాల రేషన్ బియ్యాన్ని మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజనీ లారీలో లోడ్ చేసినట్లు, అతను చెప్పిన వివరాల ప్రకారం గుజరాత్ తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. కానీ రేషన్ బియ్యం కాకినాడ తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఒక్కో బస్తాలో 50 కేజీల చొప్పున 350 క్వింటాళ్ల బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్, బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజని, చుండూరు పద్మశ్రీ రైస్ మిల్ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేబ్రోలు సీఎస్‌డీటీ భువనేశ్వరిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించినారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, డీఎస్‌వో కోమలి పద్మ, తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ, డీటీ భువనేశ్వరి, పోలీసులు పాల్గొన్నారు.

పత్తిలో బెట్ట పరిస్థితులు అధిగమించాలి

కొండేపాడు పొలంబడిలో డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు, శాస్త్రవేత్త శ్రీలక్ష్మి

కొండేపాడు (ప్రత్తిపాడు): పత్తిలో కనిపిస్తున్న బెట్ట పరిస్థితుల్ని రైతులు సమర్థంగా అధిగమించాలని డీఆర్సీ డీడీఏ రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని కొండేపాడు, కోయవారిపాలెం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటల్ని పరిశీలించారు. కాపాడుకునేందుకు రైతులు తీసుకుంటున్న చర్యలు, వినియోగిస్తున్న మందుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. పత్తిలో బెట్ట పరిస్థితులు, రసం పీల్చు పురుగుల ఉధృతిని గమనించిన డీడీఏ రైతులకు పలు సూచనలిచ్చారు. బెట్ట పరిస్థితుల్లో మొక్క పోషణకు గాను రెండు శాతం యూరియా ద్రావణాన్ని లేదా రెండు శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఒక శాతం 19-19-19 ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. రసం పీల్చు పురుగులు ప్రస్తుతం తక్కువగానే ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో పురుగుల ఉధృతి ఆర్థిక నష్టపరిమితి స్థాయిని దాటితే ఐదు మి.లీ. వేపనూనె లీటరు నీటిలో లేదా ఎసిటామిప్రిడ్ 20 ఎస్‌పిని 0.2 గ్రాములు లీటరు నీటికి లేదా డైఫెనుథ్యూరాన్ 50 డబ్ల్యూపిని 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆకుల అడుగు భాగం తడిచేలా మందును పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలుంటాయని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, గంగాభవాని, ఏవోలు రాజవంశీ, అరుణకుమారి, వ్యవసాయశాఖ సిబ్బంది చరణ్, నాగమణి పాల్గొన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి: ఈ నెల 11వ తేదీన హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాదిగల విశ్వరూపను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద గురువారం సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. విశ్వరూప సభలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్న నేపథ్యంలో మాదిగలు పెద్దఎత్తున చలో హైదరాబాద్‌కు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిలక కిరణ్ కుమార్, చందోలు విక్టర్ పాల్, కటకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, గుండిమెడ నాగేంద్ర, పాతకోటి భాస్కర్, రాజేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మజూరీ పెంచాలి



చేనేత మగ్గాల షెడ్ల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

మంగళగిరి: చేనేత కార్మికులకు మజూరీ పెంచాలని కోరుతూ ఈ నెల 4వ తేదీన జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. చేనేత కార్మికుల మజూరీ పెంచి రెండు సంవత్సరాలు పూర్తవుతుండగా, నిత్యావసర సరకులు, కుటుంబ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఉత్పత్తిదారులు కార్మికుల మజూరీ పెంచాలన్నారు. గురువారం నగరంలోని టిడ్కో నివాసాల వద్ద చేనేత మగ్గాల షెడ్ల వద్ద కార్మిక సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా కార్మికుల మజూరీ పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రదర్శనను కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, డోకిపర్తి రామారావు, వెంకటసుబ్బారావు, కూరపాటి కోటేశ్వరరావు, వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



రక్త పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం చెంచుపేటలోని రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ప్రియాంక, దేవికవాణి రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని పరిశీలించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలనేది దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డాక్టర్ మహిత మాట్లాడుతూ వైద్య శిబిరంలో జనరల్ 156, అప్తమాలజీ 49, ఈఎన్‌టీ 15 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అనంతరం టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అహ్మద్, డి.చంద్రకుమారి, అడ్మిన్ సందీప్, డీపీఎం జంగం శ్యామ్, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవం



సాయి మందిరంలో భక్తులు

తెనాలి టౌన్ : నందివెలుగులోని షిరిడిసాయిబాబా మందిరంలో గురువారం వార్షిక మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాకడ హారతితో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకుని అభిషేకాలు చేశారు. బాబావారి విశిష్ట, మహిమల గురించి ఆదిపూడి సాయిరామ్ భక్తులకు వివరించారు. హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బాబా వారిని ప్రత్యేక వాహనంపై ఉంచి సన్నాయి మేళాలు, కోలాటం, భజనలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు ఎం.వి.హరిప్రసాద్, కార్యదర్శి శ్రీవల్లి, ఉపాధ్యక్షురాలు పార్వతి, సర్వతి, రాజా, సుకుమార్, అశోక్, ఆధ్యాత్మిక భాగవతారిణి శారదా చలపతి, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడి మృతి

మంగళగిరిలో చోరీకి గురైన బైక్‌పై వెళుతుండగా ఘటన



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహం, బైక్

తెనాలిరూరల్: చోరీకి గురైన బైక్‌పై వెళ్తున్న యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. 22 నెలల క్రితం మంగళగిరిలో బైక్ చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి చినరావూరు డొంకకు చెందిన ఇండ్ల సాయికృష్ణ(19) పెదరావూరు వైపు నుంచి జంపని వైపు పల్సర్ బైక్‌పై గురువారం తెల్లవారుజామున వెళుతున్నాడు. పెదరావూరు శివారులోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్ నంబరు ప్లేటు లేకపోవడంతో ఇంజిన్, చాసిస్ నంబర్ల ఆధారంగా ఆ వాహనం 2022 జనవరి 19న మంగళగిరి పట్టణంలో చోరీకి గురైందని, ఈ మేరకు మంగళగిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. మృతి చెందిన యువకుడే బైక్ చోరీ చేసి వినియోగించుకుంటున్నాడా లేక చోరీకి పాల్పడిన వారి నుంచి కొనుగోలు చేసి వాడుతున్నాడా అన్న అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల వెంబడి వ్యర్థాలు డంప్ చెయొద్దు

పంచాయతీ అధికారులకు డీపీవో ఆదేశాలు



ప్రత్తిపాడు: వ్యర్థాల్ని రోడ్ల వెంబడి డంప్ చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి ప్రత్తిపాడు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం డీపీవో ఆకస్మికంగా సందర్శించారు. ఈవోపీఆర్డీ మావులూరి మోషే, ఎంపీడీవో కార్యాలయం ఏవో రామకోటయ్యలతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు డంపింగ్ యార్డు నిర్వహణ, కాలువల్లో పేరుకు పోతున్న మురుగు, దోమల బెడద వంటి అనేక విషయాల్ని డీపీవో దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ రోడ్ల వెంబడి వ్యర్థాల్ని గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారని ఆమెకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆమె పంచాయతీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇకపై రోడ్ల వెంబడి వ్యర్థాల్ని పడెయ్యటానికి వీల్లేదని ఆదేశించారు. ఇప్పటికే రోడ్డు వెంట డంప్ చేసిన వ్యర్థాలను యార్డుకు తరలించాలని సూచించారు. మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టాలని చెప్పారు. డీపీవోగా నియమితులై తొలిసారిగా మండలానికి వచ్చిన కుసుమ శ్రీదేవిని స్థానిక కార్యాలయం సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

అయ్యప్ప స్వాముల దీక్ష

బాపట్ల అర్బన్: బాపట్లలోని స్థానిక సోమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం వందమందికి పైగా అయ్యప్ప స్వాములు దీక్ష తీసుకున్నారు. నందిరాజు తోట, గణపవరం బాపట్ల టౌన్‌లో మహేష్ గురు స్వామి, కొండల స్వామి, సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి సోమేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి పీఠం తరపున దీక్ష వస్త్రాలు ఉచితంగా అందజేయడం జరుగుతోందని సుబ్బారావు గురుస్వామి తెలిపారు.

ఇన్‌చార్జి ఏపీపీగా 'కోట'

తెనాలిరూరల్: తెనాలి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోట రమేష్‌బాబు నాయుడుని నియమిస్తూ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న జె.ఎలిజబెత్‌రాణి పదవీ కాలం ఇటీవల పూర్తయ్యింది.

ఎంపీడీఓ విజయలక్ష్మణ్ పదోన్నతిపై బదిలీ

తెనాలి టౌన్: తెనాలి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పనిచేస్తున్న ఎల్.విజయలక్ష్మణ్‌కు డీఎల్‌డీవోగా పదోన్నతి లభించింది. తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ కార్యాలయానికి గురువారం యామె బదిలీ అయ్యారు. ఏఓగా పనిచేస్తున్న వి.ప్రతాప్ రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

27 నుంచి భావనారాయణ స్వామి ఆలయంలో కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న కుంభాభిషేకంలో భక్తులు విశేషంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు. ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రఘునాథచార్యులు మాట్లాడుతూ 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు స్వామివారికి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లుతెలిపారు. సమావేశంలో ఈవోలు టి.శ్రీనివాస్,ఆర్. రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ నాగసూరి ప్రతాప్ కుమార్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అష్టలక్ష్మి అమ్మవారికి అభిషేకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వేంచేసియున్న అష్టలక్ష్మి అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో అష్టైశ్వర్య ప్రాప్తి కోసం శుక్రవారం ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మి అమ్మవార్లకు తిరుమంజనసేవ (అభిషేకం) నిర్వహించనున్నామని భక్తులు అమ్మవారిని దర్శించి అష్టలక్ష్మి అమ్మవారి అనుగ్రహం పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పురాణం వెంకటాచార్యులు ఆ ప్రకటనలో కోరారు.

చేనేత హస్తకళల ప్రదర్శన



చేనేత హస్తకళల ప్రదర్శను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఎస్తేర్ రాణి

బాపట్ల అర్బన్: బాపట్ల టీటీడీ కల్యాణ మండపంలో భావనా రుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ అండ్ హ్యాండ్ క్రాఫ్ట్ ప్రదర్శనను జెడ్పీటీసీ ఎస్తేర్ రాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్తువులు నాణ్యతతో కూడిన మన్నికైనవని, అందంగా ఉంటాయన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. చేనేత కార్మికుల ఉత్పత్తులు పోచంపల్లి, నారాయణపేట, మంగళగిరి, కలంకారి బెడ్ షీట్లు రకరకాల డిజైన్లు తో కూడిన వస్త్రాలు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. బాపట్ల ప్రజలు ఈ ప్రదర్శనను తిలకించి చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసి చేనేత కార్మికులకు చేయూతనిచ్చి వారి జీవనోపాధికి తోడ్పాలన్నారు. ప్రదర్శన ఈ నెల 16వ తేదీ వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ బట్టు సురేష్ అందే సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నూతక్కి విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రేవేంద్రపాడు విద్యార్థులు

మంగళగిరి: గత నెల 31వ తేదీన గుంటూరు ఉర్దూ హైస్కూలులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ - 17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనపరిచిన తమ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూలు పీడీ రజనీనాయక్ గురువారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదివే సయ్యద్ జుబేరియా ఈనెల 3వ తేదీ నుంచి 5 వరకు కడప జిల్లా మైదుకూరులో జరిగే పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం రాజీవ్ రత్న, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

అండర్-14 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు రేవేంద్రపాడు విద్యార్థులు ఎంపిక..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ గురువారం తెలియజేశారు.

నారా కోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలో విశేష ప్రతిభ కనబరిచి బి.జోషి శ్రీ (9వ తరగతి, బాలుర విభాగం), ఎన్.సాయి శబరీష్ (8వ తరగతి, బాలుర విభాగం), ఎంపిక కాగా, స్టాండ్‌బైగా ఎస్.రోహిత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీలు మెల్లెంపూడి రవి, డి.సుజాతలను, క్రీడాకారులను విద్యాకమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాష్‌రావు, సర్పంచ్ పి.మేరమ్మ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సేంద్రియంతో అధిక ఆదాయం



రేపల్లె రూరల్: వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు సాగుబడి చేసి అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయ అధికారి వాగోలు బుష్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లూరు గ్రామంలో రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాగు సమయంలో అవసరం మేరకు మాత్రమే ఎరువులను ఉపయోగించాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులు సాధించవచ్చని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీఫ్ సాగు వివరాలను ఆర్బీకేలో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.